క్లుప్తంగా

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నేడు ర్యాలీ

కర్నూలు(అర్బన్): పాకిస్తాన్ ఉగ్రవాదులపై వీరోచితంగా పోరాడిన దేశ త్రివిధ దళాల సైనికుల త్యాగానికి మద్దతుగా ఈ నెల 16వ తేదీన తిరంగ ర్యాలీ నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశ సైనికులకు సంఘీభావంగా జిల్లాలోని మాజీ సైనికులందరూ తప్పనిసరిగా ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

రైతు బజారును ప్రారంభించాలి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు పరిధిలోని 32వ వార్డు గోవర్ధన్ నగర్‌లో ఉన్న రైతు బజార్‌ను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి, వర్గ సభ్యుడు కె.సుధాకరప్ప గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ రైతు బజార్ నిర్మాణం పూర్తయి దాదాపు ఐదేళ్లైనా ఎందుకు ప్రారంభించడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు.

కార్మిక సమ్మెకు పెరుగుతున్న మద్దతు



మాట్లాడుతున్న అబ్దుల్ దేశాయ్

కర్నూలు(సెంట్రల్): మే 20న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాల నుంచి మద్దతు పెరుగుతోందని సీఐటీయూ నగర అధ్యక్షుడు డి.అబ్దుల్‌దేశాయ్ పేర్కొన్నారు. గురువారం సుర్జీత్ భవన్‌లో రోడ్డు సైడు వ్యాపారస్తులు సమ్మెకు మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వంలో అంబానీ, ఆదానీలకే దేశ సంపదను కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఎస్ఎండీ షరీఫ్, ఇక్బాల్ అహ్మద్, మహ్మద్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఎస్పీ

కర్నూలు: జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జపాన్ పర్యటన పూర్తి చేసుకుని తిరిగి విధుల్లో చేరారు.ఈనెల 5 నుంచి 14వ తేదీ వరకు పది రోజుల పాటు ఎస్పీ దంపతులు జపాన్ పర్యటనకు వెళ్లారు. నంద్యాల ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా ఇన్‌చార్జ్ ఎస్పీగా వ్యవహరించారు. ఈ నెల 17న జిల్లాలో సీఎం పర్యటించనున్న నేపథ్యంలో ఎస్పీ గురువారం విధుల్లో చేరి బిజీబిజీగా గడిపారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన భద్రత చర్యలపై సమీక్షించారు.

స్టాఫ్ నర్సుకు నైటింగేల్ అవార్డు


మంజులాదేవిని సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా పనిచేస్తున్న డి.మంజులాదేవికి హెల్త్ కేర్ చారిటబుల్ ట్రస్టు వారు ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందజేశారు. గురువారం విజయవాడలో చారిటబుల్ ట్రస్టు వారు ఆమెను సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. నర్సింగ్ వృత్తిలో తాను అందించిన వైద్యసేవలకు గాను తనకు ఈ అవార్డు ఇచ్చారని మంజులా దేవి తెలిపారు.

బలిజ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు


ప్రతిభా పురస్కారాల పత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు (అర్బన్): పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన జిల్లా బలిజ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు బలిజ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ తెలిపారు. వారు గురువారం మాట్లాడుతూ.. పదో తరగతిలో 550, ఇంటర్మీడియెట్‌లో 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు వారి మార్కుల జాబితా, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, చిరునామా, ఫోన్ నంబర్లను 90000 09440 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఈ నెల 22వ తేదీ లోపు పంపి తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 25వ తేదీ ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమం టీజీవీ కళాక్షేత్రంలో ఉంటుందని, టాపర్లకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. మిగతా విద్యార్థులకు మొమెంటో, ఫైల్, ప్రతిభా పురస్కార పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు. సంఘం గౌరవాధ్యక్షుడు పత్తి ఓబులయ్య, ప్రధాన సలహాదారు డాక్టర్ సింగంశెట్టి సోమశేఖర్, సహ కార్యదర్శి ప్రకాష్ బాబు, రాయల మహిళా సంఘం అధ్యక్షురాలు అలుపూరి సుజాత తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని వెంచర్లు

- గ్రామాల్లో ఇష్టారాజ్యంగా అక్రమ లే-అవుట్‌లు
- కొన్న తర్వాత లబోదిబోమంటున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అధికారులు


గార్గేయపురం సర్వే నంబరు 749 లో అసైన్డ్ పట్టా భూముల్లో వెంచరు

కర్నూలు(రూరల్): జిల్లా కేంద్రం కర్నూలు నగర శివారులో అక్రమ లే అవుట్లు వెలుస్తున్నాయి. కొందరు రియల్ వ్యాపారులు యథేచ్ఛగా అనుమతులు లేని లే-అవుట్‌లు వేసి ప్రజలకు అంటగడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడటమే కాక కొనుగోలు చేసిన వ్యక్తులు నష్టపోతున్నారు. గ్రామాల్లో పంట పొలాలు అక్రమ వెంచర్లుగా మారిపోతున్నాయి. రియల్టర్లు జేబులు నింపుకొనేందుకు కనీస అనుమతులు కూడా తీసుకోకుండా ఇష్టానుసారంగా ప్లాట్లు వేసి అమ్మేస్తున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల చేతులు తడిపితే చాలు... ఎటువంటి అనుమతులు లేకుండా ప్లాట్లు వేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పుట్టగొడుగుల్లా కర్నూలు మండలం పరిధిలో అక్రమ వెంచర్లు వెలుస్తున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారులు అనుమతి లేని వెంచర్లను ఆదాయ వనరుగా మార్చుకున్నట్లు తెలుస్తోంది. మండలంలోని బి.తాండ్రపాడు, దిన్నెదేవరపాడు, పసుపల, పి.రుద్రవరం, నందనపల్లె, గార్గేయపురం, పడిదెంపాడు, పంచలింగాల, ఇ.తాండ్రపాడు, తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో అనుమతి లేని వెంచర్లు ఉన్నాయి. అనుమతులు తీసుకోకుండానే వ్యవసాయ భూములను ప్లాట్లుగా విభజించి వెంచర్లు వేశారు. మధ్యతరగతి ప్రజలు సొంతింటి కలలను ఆసరా చేసుకుని ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండానే స్థలాలను అంటగడుతున్నారు. నిబంధనలు పాటించని వెంచర్లలో భూమిని కొనుగోలు వ్యవహారం భవిష్యత్‌లో ఇబ్బందికరంగా మారుతుందని తెలిసినా కొందరు అలాగే కొనుగోలు చేస్తుడం గమనార్హం.

వాగులు, వంకల్లో ప్లాట్లు..

కొందరు రియల్టర్లు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి యథేచ్ఛగా వెంచర్లు వేస్తున్నారు. వాగులు, వంకలు, డొంకలు, పోరంబోకు భూములు, కాల్వ, చెరువు గట్లను సైతం వదలడం లేదు. కొందరు పంచాయతీ కార్యదర్శులకు విషయం తెలిసినా మామూళ్లతో మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అవినీతి అధికారుల అండదండలతో కొందరు రియల్టర్లు అక్రమ వెంచర్లు దర్జాగా వేస్తున్నట్లు తెలుస్తోంది. మండల పరిధిలోని 340 సి బైపాస్ వెంట బి.తాండ్రపాడు, పసుపల, పి.రుద్రవరం, సర్వే నంబరు 608, హెచ్, గార్గేయపురం సర్వేనంబరు 750, 751, 640, 648, 645, నందనపల్లె గ్రామాల్లో అసైన్డ్ పట్టా భూముల్లో వెంచర్లు వెలిశాయి. ఆయా లే- అవుట్‌లలో స్థలాలు క్రయ, విక్రయాలు జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.


పడిదెంపాడు గ్రామంలో సర్వే నంబరు 91లో అనుమతులు లేని వెంచరు

ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే...

వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చాలంటే రెవెన్యూ శాఖ నుంచి అనుమతులు తప్పనిసరిగ్గా తీసుకోవాలి. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాల నిమిత్తం వినియోగించుకునేందుకు ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. అందుకు ప్రభుత్వానికి భూమి విలువలో 2 శాతం వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ సంస్థ పరిధిలో ఉన్న భూమి అయితే ఆ సంస్థతో పాటు స్థానిక పంచాయతీ అనుమతి కూడా తప్పనిసరి. కాని రియల్టర్లు ఖర్చు తగ్గించుకునేందుకు ఇవేవీ పట్టించుకోకుండా అక్రమంగా వెంచర్లు వేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ..

దిన్నెదేవరపాడు గ్రామంలో సర్వే నంబరు 224, 225లో ప్రభుత్వ వాగును అక్రమించి ఇళ్లు నిర్మించగా గ్రామ అధికారులు పట్టించుకోవడం లేదని కొంత మంది జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత అక్రమ కట్టడాన్ని జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించి కూల్చేశారు. ఇటీవల పడిదెంపాడు, నందన పల్లె గ్రామ పరిధిలో కూడా వాగు స్థలం అక్రమణకు గురయ్యిందని జిల్లా అధికారులకు కొంతమంది ఫిర్యాదు చేశారు. పి.రుద్రవరం గ్రామంలో సర్వే నంబరు 136లో జలవనరుల శాఖకు చెందిన భూమి కూడా ఆక్రమణకు గురైందని గ్రామస్తులు చెబుతున్నారు.

లేఅవుట్లకు నిబంధనలు

- కర్నూలు అర్బన్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోని కర్నూలు మండలంలో నూతన వెంచర్ నిర్మాణంలో రియల్టర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి.
- వెంచరు వేసేందుకు ముందుగా ల్యాండ్ కన్వర్షన్ తప్పనిసరి.
- 40 అడుగుల ప్రధాన రోడ్లు ఉండాలి.
- 33 అడుగుల అంతర్గత రోడ్లు ఏర్పాటు చేయాలి
- తాగునీరు, విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి.
- గ్రామ పంచాయతీకి 10 శాతం ఖాళీ స్థలం కేటాయించాలి.
- బఫర్ జోన్‌కు దూరంగా ఉండాలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



అసైన్డ్, చుక్కల భూముల్లో, వాగు, పోరంపోగు, ఇనాం, మాన్యం భూముల్లో ఎవరైనా అక్రమంగా వెంచర్లు వేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ వెంచర్లపై మాకు ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదు. కర్నూలు రూరల్ పరిధిలోని కొన్ని గ్రామాలు కుడా పరిధిలో ఉండటంతో కుడా నిబంధనలు పాటిస్తూ లే-అవుట్‌లు వేయాలి. కొనుగోలు దారులు స్థలాలు కొనేముందు వెంచర్ అనుమతులు పరిశీలించుకోవాలి.

– జాకీర్ హుస్సేన్, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ

కారుణ్య నియామకాలు చేపట్టాలి


జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి విన్నవిస్తున్న ఎస్టీయూ నాయకులు

కర్నూలు (సిటీ): కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి, సీనియర్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని జెడ్పీ చైర్మన్ చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 2017 నుంచి ఇప్పటివరకు జూనియర్ సహాయకుల పోస్టుల కొరకు 87 మంది కారుణ్య నియామకాల కింద దరఖాస్తు చేసుకున్నారని, ప్రస్తుతం జిల్లాపరిషత్‌లో సుమారుగా 30 వరకు ఖాళీలు ఉన్నాయని, వాటిని భర్తీ చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా ఆయా కుటుంబాలు ఉద్యోగం లేక ఆర్థికంగా చిన్నాభిన్నమవుతూ పిల్లల చదువులు, వివాహాలు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయని, కావున అర్హతలను సడలించి కారుణ్య నియామకాలను వెంటనే చేపట్టాలన్నారు. చైర్మన్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మహమ్మద్ షఫి, గోవింద నాయక్, దేవదాసు, సురేష్, నారాయణ, ఉస్మాన్, సుధీర్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా డిగ్రీ, బీఈడీ పరీక్షలు

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, బీఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. డిగ్రీకి సంబంధించి రెండో సెమిస్టర్ పరీక్షలకు 4359 మందికిగాను 3824 మంది, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 347 మందికి గాను 312 మంది హాజరయ్యారు. బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షకు సంబంధించి 3278 మందికిగాను 3038 మంది హాజరయ్యారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి


రోడ్డుపై వేసిన చెత్తను చూపుతున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధులు

కర్నూలు (టౌన్): చెత్తను సకాలంలో సేకరించడంలో మున్సిపల్ యంత్రాంగం వైఫల్యం చెందడం వల్లే పారిశుద్ధ్యం లోపించిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధులు నగరంలోని భాస్కర్ నగర్, గిప్సన్ కాలనీ, బంగారుపేట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్య శాఖ అధికారి ఆఫీసుకే పరిమితమయ్యారని, పర్యవేక్షణ లేకపోవడంతోనే పారిశుద్ధ్య సమస్య నెలకొందన్నారు. చెత్తను సేకరించేందుకు కార్మికులు రాకపోవడంతో కాలనీల ప్రజలు రోడ్లపై, ఖాళీ ప్లాట్లలో, కేసీ కెనాల్‌లో చెత్తను పడేస్తున్నారన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘం ప్రతినిధులు పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసరెడ్డి, చిరంజీవి రాబర్ట్ పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా మసీదు కమిటీ

- మంత్రి సిఫారసుతో అధికారిక ఉత్తర్వులు

కర్నూలు(అర్బన్): స్థానిక 2వ పట్టణ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మసీదుకు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కమిటీని ఏర్పాటు చేశారని మసీదు ముస్సలీస్ ఇద్రూషావలి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన గురువారం మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన మంత్రి సిఫారసుతో మసీదుకు ఒక్క పూట కూడా నమాజ్‌కు రాని వ్యక్తిని కమిటీ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని వాపోయారు. మంత్రి అనుచరుడిని ప్రెసిడెంట్‌గా, ఆయన బంధవులను కమిటీ సభ్యులుగా నియమించారన్నారు. మసీదుకు వచ్చే ముస్సలీస్‌కు తెలియకుండా తబ్లీక్ జమాత్‌కు సంబంధించిన ఐదుగురిని కమిటీ సభ్యులుగా ఎలా నియమిస్తారని ప్రశ్నించారు. వక్ఫ్‌బోర్డు నిబంధనల ప్రకారం మసీదుకు 5 పూటల నమాజ్‌కు వచ్చే ముస్సలీస్ అభిప్రాయం మేరకు కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇందుకు విరుద్ధంగా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి, మతపరమైన సంస్థల్లో అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ అక్రమాలపై ఇప్పటికే రాష్ట్ర న్యాయ, మైనారిటీ శాఖ మంత్రి, ఉప లోకాయుక్త, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్, కమిషనర్, చైర్మన్ తదితరులకు తెలియజేశామన్నారు. అక్రమంగా ఏర్పాటైన కమిటీని రద్దు చేసి ప్రజాస్వామ్య పద్ధతితో కమిటీని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

తైక్వాండో శిక్షకుడి ప్రతిభ


తైక్వాండో కోచ్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న సతీష్‌కుమార్

కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి తైక్వాండో సెమినార్‌లో కర్నూలు తైక్వాండో శిక్షకులు సతీష్ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో జాతీయ స్థాయి తైక్వాండో సెమినార్ నిర్వహించారు. ఇందులో శిక్షణ ఇచ్చేందుకు ఇరాన్ దేశానికి చెందిన అబ్బాస్ షేక్ అనే శిక్షకుడిని తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసింది. ఈ సెమినార్‌లో కర్నూలు నగరానికి చెందిన యస్.సతీష్ కుమార్ మెలకువలను అభ్యసించి అత్యంత ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ప్రశంసలు అందుకున్నారు. దీంతో విజయనగరం జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, ఇరాన్ దేశానికి చెందిన కోచ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, అబ్దుల్ మజీద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై నివేదిక



జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న డీఈఓ శామ్యూల్‌పాల్

కర్నూలు (సిటీ): జిల్లాలో విద్యారంగం బలోపేతానికి నిర్దిష్టమైన ప్రతిపాదనలు పంపి అత్యధిక పోస్టులు మంజూరు చేయించిన సందర్భంగా గురువారం ఉదయం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను కలిసి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో చేపట్టనున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను డీఈఓ కలెక్టర్‌కు అందజేసి వివరించారు. పాఠశాలల్లో రాబోయే విద్యా సంవత్సరానికి టీచర్ల కొరత లేకుండా జిల్లాకు కొత్త పోస్టులు, పాఠశాల మంజూరు చేయించడం పట్ల విద్యాశాఖ రాబోయే విద్యా సంవత్సరంలో నూతన ఉత్తేజం పొందుతుందన్నారు. నాణ్యమైన విద్యాబోధన అందించే లక్ష్యంతో కృషి చేశారని, ఇందుకు జిల్లా విద్యా శాఖ పక్షాన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ కృషి వల్ల 49 ఫౌండేషన్ స్కూళ్లు, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 278, మోడల్ ప్రైమరీ స్కూళ్లు 754, అప్పర్ స్కూళ్లు 32, హైస్కూళ్లు 337 మొత్తం 1,455 స్కూళ్ల జీఓ 117 రద్దు తర్వాత ఏర్పడ్డాయన్నారు. ఇందులో భాగంగా 'కన్వర్షన్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ పోస్ట్స్' కింద 251 పోస్టులు ఆదర్శ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులుగా మంజూరయ్యాయని, సర్‌ప్లస్‌గా ఉన్న 97 పోస్టులను అవసరమైన ఖాళీలకు అనుగుణంగా కన్వర్ట్ చేయడం జరిగిందన్నారు. కొత్తగా 86 హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పోస్టులు, 957 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 406 ఎస్జీటీ పోస్టులు కలుపుకుని మొత్తం 1,449 మంజూరయ్యాయన్నారు. అలాగే జిల్లాలో 97 అప్పర్ ప్రైమరీ స్కూళ్లు, జిల్లాలో 2,798 అన్ని కేటగిరీల్లో ఖాళీలు ఉన్నాయని, ప్రధానోపాధ్యాయులు ఐదేళ్లు, టీచర్లు ఎనిమిది సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసిన ఖాళీలు 2713 ఉన్నాయని, స్కూల్ అసిస్టెంట్ కన్వర్ట్ ద్వారా 251 ఎస్జీటీ కన్వర్ట్ ద్వారా 93 పోస్టులు అప్‌గ్రేడ్ ద్వారా 100 పోస్టులు, కొత్తగా సృష్టించిన ఖాళీలు 1449, సర్‌ప్లస్ షిఫ్ట్ ద్వారా 1143 పోస్టులు కలిపి మొత్తం 8047 జిల్లా వ్యాప్తంగా ఖాళీలు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ఖాళీలు ఉన్న జిల్లాగా కర్నూలు గుర్తించడం జరిగిందని డీఈఓ కలెక్టర్‌కు వివరించారు.

పాలకవర్గం ఏర్పాటు

కర్నూలు(అగ్రికల్చర్): పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగానే పాలకవర్గం ఏర్పాటైంది. స్థానిక ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉండే విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ గౌరవ చైర్మన్, కృష్ణగిరి మండలం ఆలంకొండ గ్రామానికి చెందిన షేక్ నబీ సాహేబ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. వైస్ చైర్మన్‌గా మురసాని నాగేశ్వరరెడ్డి, 14 మంది సభ్యులుగా నియమితులయ్యారు. ఈ పాలక వర్గం ఏడాది పాటు పదవిలో కొనసాగుతుంది.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ పోస్టుల భర్తీపై విచారణ

సాక్షి ఎఫెక్ట్

కర్నూలు (హాస్పిటల్): కర్నూలులోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్టుల భర్తీ విషయంలో అభ్యంతరాలు రావడంతో దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేయనున్నట్లు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. 'స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు' అనే శీర్షికన గురువారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయమై ఆమె స్పందిస్తూ పోస్టుల భర్తీలో అభ్యంతరాల విషయంలో ఎలాంటి అపోహలకు తావులేదని, జనరల్ డ్యూటీ అటెండెంట్ పోస్టు విషయంలో పూర్తిస్థాయిలో సర్టిఫికెట్లు ఒరిజినల్ అని తేలిన తర్వాతనే వారికి వేతనాలు చెల్లిస్తామనే నిబంధనతోనే అపాయింట్‌మెంట్ ఆర్డర్స్ ఇచ్చామన్నారు. వారి సర్టిఫికెట్లు నకిలీవని తేలితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇటీవల మూడు నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇచ్చామన్నారు. అలాగే 33 శాతం ఉమెన్ రిజర్వేషన్, ఎస్టీ రోస్టర్ అంశంలో కూడా ఉన్నతాధికారుల నుంచి వచ్చిన నూతన గైడ్‌లైన్స్ ప్రకారం పోస్టులు భర్తీ చేశామని, కేవలం రెండు పోస్టులు మాత్రమే ఉన్నందున 33 శాతం రిజర్వేషన్ ఉత్పన్నం కాదన్నారు. పోస్టుల భర్తీ విషయంలో పూర్తిస్థాయిలో మెరిట్ కమ్ రోస్టర్, సర్టిఫికెట్ల ఒరిజినాలిటీ పరిశీలిస్తున్నామన్నారు. ఇందులో ఎలాంటి ప్రలోభాలకు తావులేదని, ఏవైనా ఆధారాలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

18న డాక్టర్‌నాగేశ్వరరెడ్డికి సన్మానం


డాక్టర్ నాగేశ్వరరెడ్డితో డాక్టర్ శంకరశర్మ, డాక్టర్ మోహన్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత, కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ఏఐజీ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డిని ఈ నెల 18వ తేదీన కర్నూలులో ఘనంగా సన్మానించనున్నట్లు సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చెప్పారు. ఈ మేరకు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ జి.మోహన్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి ఆయన్ను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 18వ తేదీన స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవన్‌లో వైద్య విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నామన్నారు. ఇందులో పేగుల ఆరోగ్యం గురించి డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రసంగిస్తారని, అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు.

భట్టాచార్య మరణం తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): అఖిల భారత రోడ్డు రవాణా కార్మిక సంఘం(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) జాతీయ అధ్యక్షుడు నేపాల్ బుద్ధదేవ్ భట్టాచార్య మరణం రవాణా రంగానికి తీరని లోటని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పేర్కొన్నారు. గురువారం కార్మిక, కర్షక భవన్‌లో భట్టాచార్య ఆకస్మిక మరణాన్ని పురస్కరించుకొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నట్లు ప్రకటించారు.

బాలికపై కుక్కల దాడి

కర్నూలు(రూరల్): నగరంలోని సోమిశెట్టి నగర్‌కు చెందిన దీపిక అనే 11 సంవత్సరాల బాలికపై కుక్కలు దాడి చేశాయి. బాలిక ఎడమ చేయికి గాయమైంది. వీధిలో నడుచుకుంటూ వస్తుండగా కాలనీలోని వేంకటేశ్వరస్వామి అలయం ఎదురుగా ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు బాలికను ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. సోమిశెట్టి నగర్‌లో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంఘాలపై దాడి అమానుషం

- అధికార పార్టీ అండతో రెచ్చిపోతున్న టీజీ వెంకటేష్
- కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలి



మాట్లాడుతున్న డి.గౌస్‌దేశాయ్

కర్నూలు(సెంట్రల్): మంత్రి టీజీ భరత్ అండదండలతో టీజీ వెంకటేష్ రెచ్చిపోతున్నారని, ఎవరైనా మాట్లాడితే దాడులు చేయించి భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం కర్నూలు రూరల్ మండలం గొందిపర్లలో పీటీఎఫ్ఈ ప్లాంటు విస్తరణపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ప్రజా సంఘాల నాయకులపై దాడులు, మీడియా నిర్బంధాలను ఖండిస్తున్నట్లు చెప్పారు. దాడులు జరుగుతున్నా చోద్యం చూసిన పోలీసులు, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పరిశ్రమతో పంచలింగాల, గొందిపర్ల, దేవమాడతోపాటు ఆరు లక్షల జనాభా కలిగిన కర్నూలుకు ప్రమాద ఘంటికలు తప్పవని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా అధికార, డబ్బు బలంతో టీజీవీ గ్రూపు మొండిగా ముందుకు వెళ్లడం సరైంది కాదన్నారు. పరిశ్రమలో వాడే పదార్థాలపై అధ్యయనం చేసి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిన బాబురావు అనే సైంటిస్టుపై సీపీఎం ముద్ర వేయడం అన్యాయమన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ నిష్పక్షపాతంగా జరగాలంటే కలెక్టరేట్‌లో నిర్వహించాలని జేసీని కోరినా పట్టించుకోలేదని చెప్పారు. తమకు అనుకూలమైన వారితో టీజీవీ గ్రూపు స్క్రిప్టు చదివించారని ఆరోపించారు. సరైన ప్రజాభిప్రాయ సేకరణ జరగకపోవడానికి ముమ్మాటికీ కలెక్టర్, ఎస్పీలే కారణమని ఆరోపించారు. తక్షణమే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి మరోసారి కలెక్టరేట్‌లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శులు టి.రాముడు, రాజశేఖర్ పాల్గొన్నారు.

కేఎంసీ క్యాంటీన్ వ్యవహారంపై నేడు సమావేశం

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల క్యాంటీన్ వ్యవహారంలో నెలకొన్న వివాదంపై ఈనెల 16న వైద్యులతో సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజురోజుకు క్యాంటీన్ వ్యవహారం చర్చనీయాంశం కావడంతో దీనిపై చర్చించేందుకు కళాశాలలోని హెచ్ఓడీలు, వైద్యులతో కౌన్సిల్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో అందరి అభిప్రాయాలు తీసుకుని డీఎంఈ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్యాంటీన్ వ్యవహారంపై తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధి, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ స్టేడియంలోని లక్ష్యా సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న ఫుట్‌బాల్ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఆ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు అభినందించారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు మద్దూరు రేణుక, బోయ శ్రీలక్ష్మీ ఆంధ్రప్రదేశ్ బీచ్ సాకర్ టీంలో ఎంపికైయ్యా. డామన్‌లో జరిగే ఖేలో ఇండియా జాతీయ క్రీడల్లో పాల్గొననున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. క్రీడాకారులను రిజిస్ట్రార్‌తో పాటు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఇందిరాశాంతి, ఫిజికల్ డైరెక్టర్ వై.శ్రీనివాసరెడ్డి, కోచ్ బ్రహ్మకుమార్ అభినందించారు.